
సాక్షి ఒడిశా

బుధవారం । 10 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,35,431లు, బంగారం 4 గ్రాములు, వెండి 12 గ్రాముల100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రత్న భాండాగారం తెరుస్తాం

ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత శ్రీ జగన్నాథుని రత్న భాండాగారం తెలుస్తామని జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అన్నారు.

- 8లో



కూర్మావతారంలో జగన్నాథుడు

గుండిచా మందిరంలో కొలువైయున్న శ్రీజగన్నాథుడు మంగళవారం కూర్మ, మత్స్య అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చాడు.

- 8లో

న్యూస్‌రీల్

'తాగునీటి సమస్యలు పరిష్కరించండి'



కలెక్టరేట్ వద్ద కొటియా ప్రజలు

కొరాపుట్: తమ గ్రామంలో తాగునీటి వసతులు కల్పించాలని కొటియా ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పొట్టంగి సమితి కొటియా గ్రామ పంచాయతీ తలబార్‌బంద గ్రామస్తులు జిల్లా కేంద్రానికి మంగళవారం తరలి వచ్చారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వి.కీర్తివాసన్‌ను కలిసి తమ సమస్యలు ఏకరువు పెట్టారు. కొండల నుంచి వచ్చే నీరు తాగుతుండడం వలన గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు ఈ సీజన్‌లో తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అలాగే తమ గ్రామంలో ఒక్కరికే ఇందిరా ఆవాస్ ఇల్లు మంజూరు అయ్యిందన్నారు. వీటితో పాటు విద్యుత్, రహదారి సమస్యలు కలెక్టర్‌కి వివరించారు. సమస్యలు పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు గిరిజనులు పేర్కొన్నారు.

భొట్టంగపాదొరొలో బీజేపీ నాయకుల పర్యటన



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి డిమిరిగుడ పంచాయతీ భొట్టొంగపాదొరొ గ్రామంలో అతిసారం వ్యాపించి ఒకరు మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకుడు జగన్నాథ నుండ్రుక ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు భొట్టొంగపాదొరొ గ్రామంలో మంగళవారం పర్యటించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబంతో పాటు గ్రామంలోని ప్రతి ఇంటికీ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. గ్రామంలో తాగునీటి సౌకర్యాలు లేకపోవడం వలనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. జిల్లా యంత్రాంగం సత్వర చర్యలు చేపట్టి గ్రామంలో తాగునీటి సౌకర్యార్థం గొట్టపు బావులు ఏర్పాటు చేయాలని కోరారు.

అవుట్ లుక్ ఐకార్ ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానం



సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలోని ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు అవుట్ లుక్ ఐకార్ ర్యాంకింగ్–2024లో ప్రథమ స్థానం లభించడం గర్వకారణంగా ఉందని వర్సిటీ ఉపకులపతి డా.సుప్రియా పట్నాయిక్ తెలిపారు. సెంచూరియన్ వర్సిటీ అకడమిక్ ఎక్స్‌లెన్స్ ఫ్యాకల్టీ నాణ్యతా ప్రమాణాలతో పాటు మౌలిక సౌకర్యాలు, పరిశోధన శాఖను పరిశీలించి ఈ ర్యాంకు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. కళాశాల ఫ్యాకల్టీ అంకిత భావం, ఆకట్టుకునే ప్రదర్శన, అగ్రిఫెస్టలతో అద్భుతమైన మైలురాయిని సాధించిందన్నారు. కళాశాల ఒడిశాలో నంబర్ వన్ స్థానం సాధించడంపై వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు హర్షం వ్యక్తం చేశారు. భారతదేశంలోనే అత్యుత్తమ విద్యనందించే వర్సిటీల్లో సెంచూరియన్ ఒకటిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు.

నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గ్రీవెన్స్ సెల్



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్

కొరాపుట్: జిల్లాలోని మదయిగాంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారం (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమంలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి పాల్గొన్నారు. ఎమ్మెల్యే అయిన తర్వాత తొలిసారిగా ఆ గ్రామంలోని ప్రజల వినతులు స్వీకరించారు. వివిధ శాఖల అధికారుల సమక్షంలో పెద్ద ఎతున ప్రజలు తమ వినతులు అందించారు. వీటిలో అత్యధికంగా పింఛన్లు, రేషన్ కార్డులు, రోడ్లు, తాగునీరు తదితర సమస్యలు ఉన్నాయి. ప్రజల సమక్షంలోనే అత్యధిక ఫిర్యాదులు పరిష్కరించారు.

కమనీయం.. గుండిచా వైభవం..!



- రథయాత్రలో కీలకంగా గుండిచా మందిరం
- దేవదేవుడి పిన్నమ్మ ఇల్లుగా ప్రతీతి
- 16వ శతాబ్ధంలో ఆలయ స్థాపన

భువనేశ్వర్: కులాలు, మతాలకు అతీతంగా భక్తులకు దర్శనమివ్వడానికి ఆలయం నుంచి బయటకు వచ్చే ఏకైక దేవుడు శ్రీజగన్నాథుడు. వార్షిక రథయాత్ర సందర్భంగా శ్రీమందిరం నుంచి వచ్చి గుండిచా మందిరంలో కొలువుదీరుతాడు. స్వామి వార్షిక రథయాత్ర గుండిచా యాత్రగా కూడ ప్రతీతి. ఈ మండపంలో మూల విరాటులకు వేదికగా అడపా మండపం అలంకృతమైంది. సోదర సోదరీ సమేతంగా శ్రీజగన్నాథుడు ఈ మండపంపై కొలువు దీరాడు. ఈ మందిరానికి గుండిచా ఘొరొ (ఇల్లు)గా కూడ స్థానికులు వ్యవహరిస్తారు. మారుమూల ప్రాంతాల నుంచి తరలి వస్తున్న భక్తులతో స్థానిక గుండిచా మందిరం కిటకిటలాడుతోంది. ఈ ఆలయం ఏడాది పొడవునా ఖాళీగా ఉంటుంది. వార్షిక జగన్నాథ యాత్రలో మాత్రం కీలక పాత్ర పోషిస్తుంది.

అధిష్టాన దేవతగా గుండిచా

16వ శతాబ్ధంలో స్థాపించబడిన గుండిచా ఆలయం జగన్నాథ ఆలయానికి ఈశాన్య భాగంలో ఉంది. గుండిచా శ్రీకృష్ణుని పిన్నమ్మగా నమ్ముతారు. ఆమెను ఈ ఆలయం అధిష్టాన దేవతగా కొలుస్తారు. పూరీలోని జగన్నాథ ఆలయానికి ఉత్తరాన రెండు మైళ్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి తోబుట్టువులతో కలిసి శ్రీజగన్నాథుడు తరలి రావడంతో గుండిచా యాత్రగా పేరొందింది. సుదర్శన్‌తో కూడిన దేవతలు గుండిచా ఆలయంలో ఏడు రోజులు కొలువుదీరుతారు. పిన్నమ్మ ఇంట స్వామి ఆనందోత్సాహాలతో గడిపి తిరిగి శ్రీ మందిరానికి తరలి వెళ్లడం మారు రథయాత్ర (బహుడా)గా నిర్వహిస్తారు. ఈ వ్యవధిలో పలు ప్రముఖ కార్యకలాపాలకు గుండిచా కేంద్రంగా మారడంతో యాత్రలో ప్రాధాన్యత సంతరించుకుంది.

హీరా పంచమి వేడుక

నవ దినాత్మక రథయాత్ర పురస్కరించుకుని నిర్వహించే ప్రత్యేక ఉత్సవాల్లో హీరా పంచమి ప్రత్యేకత సంతరించుకుంది. ఇదో ప్రధాన వేడుక. సోదర సోదరి సమేతంగా శ్రీజగన్నాథుడు ప్రియసఖి మహాలక్ష్మిని విస్మరించి గుండిచా యాత్రకు విచ్చేస్తాడు. స్వామి లేకుండా ఒంటరిగా విరహ వేదన భరించలేక మహాలక్ష్మి పంచమి నాడు శ్రీమందిరం నుంచి బయల్దేరి స్వామి దర్శనం కోసం అత్యంత ఉత్సాహంతో పల్లకిలో వేంచేస్తుంది. ఐతే దేవేరి గుండిచా ప్రాంగణానికి చేరే సమయానికి ఉత్సవాదులు పురస్కరించుకుని ప్రవేశ ద్వారం మూతబడుతుంది. స్వామి దర్శనం ప్రాప్తించక అత్యంత మనస్తాపానికి గురైన మహాలక్ష్మి శ్రీజగన్నాథుని రథం నందిఘోష్ కూలదోసేందుకు విఫలయత్నం చేస్తుంది. ఈ ప్రయత్నంలో రథం చెక్క తొలగించి విచార వదనంతో శ్రీమందిరానికి తరలి వెళ్లడం ఇతివృత్తంగా హీరా పంచమి వేడుక గుండిచా ఆవరణలో జరుగుతుంది. ఇదో ముచ్చట గొలిపే ఉత్సవం. మానవీయ నైజానికి అద్దం పట్టే వేడుక.

రథాల మలుపు

స్వామి రాక కోసం మహాలక్ష్మి వేదన గ్రహించిన శ్రీజగన్నాథుడు ప్రియసఖి చెంతకు చేరేందుకు సన్నద్ధం అవుతాడు. అందుకు అనుకూలంగా గుండిచా ఆవరణలో నిలిచిన 3 రథాలను మలుపు తిప్పుతారు. హీరా పంచమి మర్నాడు రథాలను దక్షిణం వైపు మలుపుతిప్పి మారురథ యాత్రకు సిద్ధం చేస్తారు. బహుడా సన్నాహాలకు ఇదే శ్రీకారం. ఇలా సిద్ధం చేసిన రథాలపైకి బహుడా నాడు తూర్పున ఉన్న నక్కొచౌణా ద్వారం గుండా గొట్టి పొహండిగా మూల విరాటులను వరుస క్రమంలో తరలిస్తారు. రథాలపై దేవుళ్ల ఆసీనులు కావడంతో మారురథ యాత్ర ప్రారంభం అవుతుంది.

గుండిచా విశేషాలివీ..

గుండిచా ఆలయానికి ఇంద్రద్యుమ్నుడి భార్య రాణి గుండిచా పేరు పెట్టారు. దుర్గామాత అవతారంగా గుండిచాకు పూజాదులు నిర్వహిస్తారు. ఈ ఆలయానికి పడమర ద్వారం మరియు తూర్పు ద్వారం వంటి రెండు ద్వారాలు ఉన్నాయి. రథయాత్ర సమయంలో జగన్నాథుని దేవతలు ఆలయంలోకి ప్రవేశించే ప్రధాన ద్వారం పశ్చిమ ద్వారం. తూర్పు ద్వారం నక్కొచౌణా ద్వారంగా కూడ వ్యవహరిస్తారు. ఈ ద్వారం గుండా బహుడా పురస్కరించుకుని దేవతలు నిష్క్రమిస్తారు. చైతన్య మహాప్రభు తన అనుచరులు మరియు సేవకులను తప్పించుకు గుండిచా ఆలయానికి ఒంటరిగా వెళ్లిన తర్వాత రహస్యంగా శాశ్వతంగా అదృశ్యమైనట్లు పురాణ పుక్కిటం ప్రచారంలో ఉంది.

'అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి'



మాట్లాడుతున్న భాస్కరరైతా వేదికపై సాహు, పండ తదితరులు

రాయగడ: యువత తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర రైతా అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన ప్రధానమంత్రి అప్రెంటిషిప్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐటీఐల్లో వృత్తి శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి అప్రెంటిషిప్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ఎంతోమంది నిరుద్యోగులకు బాసటగా నిలుస్తోందన్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్ అతూల్య కుమార్ పండా మాట్లాడుతూ ఈ మేళాలో 117 మంది విద్యార్థులు పాల్గొనగా, వీరిలో 96 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో అవకాశాలను పొందగలిగారన్నారు. కార్యక్రమంలో డీఐసీ మాజీ ఐపీవో సవ్యసాచి సాహు, రాయగడ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ బబిలత షరఫ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై ఇనుప రాడ్డుతో దాడి



చికిత్స పొందుతున్న ఘెను బిశాయి

జయపురం: ప్రభుత్వ భూమిలో పంటలు సాగు చేస్తున్న ఒక యువకుడిపై కొంతమంది దాడిచేసి తీవ్రంగా గాయపరిచినట్లు బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ మండెకఝొరణ గ్రామానికి చెందిన ఘెను బిశాయి కొంతకాలంగా ప్రభుత్వ భూమిని చదును చేసి అందులో పంటలు పండిస్తున్నాడు. అతను మంగళవారం ఉదయం పొలం దున్నేందుకు వెళ్లాడు. కొంత పొలం దున్నిన తర్వాత ఆకలి వేయడంతో పొలం గట్టున కూర్చుని తింటున్నాడు. ఆ సమయంలో మండెకఝొరణ గ్రామానికి సమీపంలోని జమెలబెడకు చెందిన డొంబు పాత్రో, రఘు పాత్రో, సంతోష్ పాత్రో, డొము నారాజీ, బుదు నారాజీ తదితరులు వచ్చి ప్రభుత్వ భూమిలో పంట పండించవద్దని హెచ్చరించారు. అనంతరం వారు ఘెను బిశాయిని అసభ్యంగా తిడుతూ అతడిపై దురుసుగా ప్రవర్తించారు. అంతటితో ఆగకుండా డొంబు పాత్రో అనే వ్యక్తి ఒక ఇనుప రాడ్డుతో ఘెను తలపై కొట్టడంతో తల పగిలింది. ఆ సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న కొంతమంది ఆ ఘటనను చూచి వెంటనే అక్కడికి చేరుకొని తీవ్రంగా గాయపడిన ఘెనును బొయిపరిగుడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘెను తనపై దాడి జరిపిన డొంబు పాత్రోను అతడి సహచరులను అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

నాసిరకం.. ప్రజలకు నరకం..!





బొయిపరిగుడ సమితి పూజారిగుడ గ్రామ పంచాయతీ బరంగపల్లి–పూజారిగుడల మధ్య తారు రోడ్డు వేసి నెల రోజులు కాకుండానే పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో భాగంగా రోడ్డు వేయగా ప్రస్తుతం రాళ్లతేరి కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ రోడ్డు వెంబడి ప్రయాణాలు చేయాలంటేనే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు అధికారులు, కంట్రాక్టర్లు పాతర వేయడంతోనే పెచ్చులూడిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– జయపురం

వృద్ధురాలి చెవి దిద్దులు చోరీ



బాధితురాలు బదలి కద్రక

రాయగడ: ఒక వృద్ధురాలి చెవి దిద్దులను గుర్తు తెలియని దుండగుడు తెంపుకెళ్లిన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి నారాయణపూర్ పంచాయతీ డెంగిశిలి గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. డెంగిశిలి గ్రామానికి చెందిన బదిలి కద్రక అనే వృద్ధురాలు ఎప్పటిలాగే గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తన పొలానికి సోమవారం ఉదయం వెళ్లింది. పనులు ముగిసిన తర్వాత సాయంత్రం తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో వెనుక వెంబడిస్తూ ఒక గుర్తు తెలియని దుండగుడు వచ్చి, ఆమె చెవిలోని బంగారు దిద్దులను లాక్కెళ్లిపోయాడు. మరో చెవిలో దిద్దులు లాక్కుంటుండగా ఆమె కేకలు వేసింది. దీంతో అక్కడే పొలం పనులు చేసుకుంటున్న కొందరు గ్రామస్తులు పరుగున అక్కడికి వచ్చారు. దీంతో అతను పరారయ్యాడు. ఈ మేరకు ఆమె కల్యాణ సింగుపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దుండగుడి కోసం గాలిస్తున్నారు.

ఇంటికి చేరిన మానసిక దివ్యాంగుడు



కుటుంబ సభ్యులతో ఘాసీరాం

కొరాపుట్: సోషల్ మీడియా సాయంతో మానసిక దివ్యాంగుడు ఇంటికి చేరడంతో ఆ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మల్కన్‌గిరి జిల్లా మత్తిలి పోలీస్‌స్టేషన్ పరిధి తిమ్మాపుట్ గ్రామానికి చెందిన ఘాసిరాం కొటియా మానసిక దివ్యాంగుడు. అతను తన కుమారుడు భీమొ కొటియాతో భువనేశ్వర్ నుంచి వచ్చి కొరాపుట్ బస్టాండ్‌లో తప్పిపోయాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు కొరాపుట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే అన్ని సోషల్ మీడియా వేదికల్లో విషయాన్ని తెలియజేశారు. దీంతో వారం రోజుల తర్వాత కొరాపుట్ – బొరిగుమ్మ మార్గంలో రాణిగుడ గ్రామంలో ఒక మానసిక దివ్యాంగుడిని ప్రజలు గుర్తించారు. సోషల్ మీడియాలో తాము చూసిన వ్యక్తి అతనే కావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి ఘాసీరాంను తమతో తీసుకొని వెళ్లారు.

పార్కింగ్ స్థలం ప్రారంభం



ప్రారంభోత్సవ పూజ చేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: పట్టణంలో ఏర్పాటు చేసిన పెయిడ్ పార్కింగ్ స్థలాన్ని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఆదివారం ప్రారంభించారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని గోబర్ధన ముండ ప్రాంతంలో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ స్థలంలో ప్రతిరోజూ వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చన్నారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు రెండు గంటలు పార్కింగ్ చేస్తే రూ.5లు చెల్లించాలని, నాలుగు చక్రాల వాహనాలకు రెండు గంటకు రూ.20లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. నిర్ధారిత సమయం కన్నా ఎక్కువ కాలం పార్కింగ్ చేస్తే 2 గంటల సమయం చొప్పున రేటు వసూలు చేయడం జరుగుతుందన్నారు. రాత్రి సమయాల్లో సురక్షితంగా వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ అధికారి దేవీ ప్రసాద్ డాలి, సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పొరిడ, మున్సిపాలిటీ తాత్కాలిక కార్య నిర్వాహక అధికారి శక్తి మహాపాత్రో, మున్సిపల్ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

జయపురం.. జలమయం

జయపురం పట్టణంలో సోమ, మంగళవారాల్లో ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం కురిసిన కుండపోత వర్షం కారణంగా గుండిచా మందిరానికి అతికష్టంపై అర్థరాత్రి సమయానికి జగన్నాథ రథం చేరింది. వర్షపు నీటి ప్రభావానికి కల్వర్టులు కొట్టుకుపోయాయి. వాహనదారులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– జయపురం



వర్షపు నీటికి కొట్టుకుపోయిన కల్వర్టు



జాతీయ రహదారిలో పారుతున్న నీరు



రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు



దుకాణాల వద్ద వర్షపు నీరు

క్లుప్తంగా

టెక్కలిలో ఇసుక అమ్మకాలు ప్రారంభం



ఇసుక అమ్మకాలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తదితరులు

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ డిపోకు ఆనుకుని ఉన్న స్టాక్ పాయింట్ వద్ద మంగళవారం ఇసుక అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానంలో భాగంగా టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి నేతృత్వంలో అమ్మకాలను మంగళవారం ప్రారంభించారు. టన్ను ఇసుక రూ.340ల చొప్పున ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అమ్మకాలు చేసే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు.

ఐదు ఇసుక లారీలు స్వాధీనం



పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన లారీలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై చిలకపాలేం వద్ద సెబ్ చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఇక్కడ ఐదు ఇసుక లారీలను మంగళవారం పట్టుకొని ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఒడిశా రాష్ట్రం నుంచి, కరజాడ రీచ్ నుంచి ఈ లారీలు వచ్చినట్లు గుర్తించారు. ఎలాంటి రశీదులు, ఆధారాలు లేకపోవటంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఐదు ఇసుక లారీలు సీజ్ చేసినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల తుదివిడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ తుది విడత ప్రవేశాలకు సంబంధించి పాలీసెట్-2024 తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంస్థ మంగళవారం విడుదల చేసింది. మొదటి విడతలో జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ 10 పాలిటెక్నిక్‌లు ఉండగా, 2674 సీట్లకు 1427 ప్రవేశాలు జరిగాయి. తుదివిడత ప్రవేశాల కౌన్సెలింగ్‌లో మొదటి విడత సీట్లు వచ్చిన విద్యార్థులు కళాశాలలు మార్చుకోవచ్చు. పాలీసెట్ ర్యాంకు వచ్చి కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు హాజరై సీట్లు పొందవచ్చు. షెడ్యూల్ మేరకు ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ధ్రువీకరణ పత్రాల పరిశీలన శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఆప్షన్ల ఎంట్రీ 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తారు. సీట్ల అలాట్‌మెంట్ 16వ తేదీన ప్రకటిస్తారు. సీటు లభించిన కళాశాలలకు 18వ తేదీ నుంచి 20వ తేదీ మధ్య హాజరు కావాల్సి ఉంటుంది. షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జి.దామోదర్ రావు తెలిపారు.

ఎన్నికల నిధుల పంపిణీలో చేతివాటం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల సమయంలో పంచాల్సిన అలవెన్సుల విషయంలో శ్రీకాకుళం నియోజకవర్గం తీరు వేరుగా కనిపిస్తోంది. ఎలక్షన్ల సమ యంలో పనిచేసిన కిందిస్థాయి సిబ్బందికి చెల్లించాల్సిన అలవెన్సులు, వారు ఆ సమయంలో పెట్టిన ఖర్చులు ఎగవేసే స్థితికి శ్రీకాకుళం నియోజకవర్గ ఎన్నికల అధికారులు చేరుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భోజనం, వసతులు, సామగ్రి, టెంట్లు, రవాణా వంటివి సరఫరా చేసిన ఏజెన్సీలు ఇప్పుడు డబ్బులు అందక ఇబ్బంది పడుతున్నాయి. జిల్లాలో ఎనిమిది శాసన సభ నియోజకవర్గాలు ఉండగా వీటిలో శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో అవినీతి బిల్లులు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల కలెక్టర్ మారడంతో మిగిలిన నిధులు కాజేసి వెళ్లిపోవడానికి 'కొందరు అధికారులు' సిద్ధంగా ఉన్నట్లు భోగట్టా. ఎన్నికల సమయంలో శిక్షణలకు అంతా కలిసి 725 మంది కాగా, వీరి భోజనాల బిల్లులు 1600 మందికి పెట్టారు. అలాగే టీటీ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, సబార్డినేట్లు, వీఆర్వో, వీఆర్ఏ, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఎన్నిక సమయంలో అదనపు పనిభారం ఉన్నందున వారికి అలవెన్సులు అందజేయడం జరుగుతోంది. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ అలవెన్సులు కొందరికి అందలేదు. మరి కొందరికి కోత పెట్టారు. కొంతమంది సిబ్బంది ఇంత తక్కువ నగదు వద్దని నిరాకరించారు. అలవెన్సులు పక్క నియోజకవర్గాలకంటే తక్కువగా ఇచ్చారని శ్రీకాకుళం రెవెన్యూ కార్యాలయంలో ఒక ఉద్యోగి నేరుగా ఆర్డీవో(ఆర్ఓ)కు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లే దు. పక్క నియోజకవర్గం ఆమదాలవలస వారు అందజేసిన క్రమంలో అందజేయాలని చాలామంది సిబ్బంది ఆర్ఓని కోరినా అక్కడ స్పందన లేకపోవడంతో అడగడం కూడా మానేశారు. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గానికి ఇప్పటికే రూ.1,51,68,428లు విడుదల అయ్యాయి. ఇంకా రూ.15,70,921 రావాల్సి ఉంది. అయితే ఇక్కడి ఎన్నికల అధికారుల మాత్రం రూ.2 కోట్లకు పైగా రావాలని బిల్లులు సమర్పించారు.

రత్న భాండాగారం తెరుస్తాం

- జస్టిస్ బిశ్వనాథ్ రథ్ ప్యానెల్
- జూలై 14 ప్రతిపాదిత తేదీగా ప్రకటన



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



వివరాలు వెల్లడిస్తున్న జస్టిస్ బిశ్వనాథ్ రథ్

భువనేశ్వర్: ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత శ్రీ జగన్నాథుని రత్న భాండాగారం తెలుస్తామని జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అన్నారు. పూరీ శ్రీజగన్నాథ దేవాలయంలోని రత్న భాండాగారం జూలై 14న తెరవాలని ఆయన ఆధ్వర్యంలోని 16 మంది సభ్యుల తనిఖీ పర్యవేక్షక కమిటీ మంగళవారం ప్రతిపాదించింది. అయితే ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది. 46 ఏళ్ల తర్వాత భాండాగారంలో భద్రపరిచిన ఆభరణాలతో సహా విలువైన వస్తువుల వివరాలతో జాబితా రూపకల్పన కోసం పర్యవేక్షించేందుకు ఒడిశా హైకోర్టు విరామ న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షతన అత్యున్నత స్థాయి కమిటీ రెండో సమావేశంలో రత్న భండార్‌ను తెరవడంపై నిర్ణయం తీసుకున్నారు. శ్రీ మందిరం పాలక మండలి సమావేశాన్ని ఏర్పాటు చేసి తనిఖీ పర్యవేక్షక కమిటీ ప్రతిపాదనపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది.

ఏకగ్రీవ తీర్మానం

జూలై 14న రత్న భాండాగారం లోపలి గది తాళం తెరవాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించేందుకు విస్తృతంగా చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. దీని ప్రకారం మరమ్మతు పనులు, అమూల్య రత్న సంపద మరియు విలువైన వస్తువుల లెక్కింపు రెండింటికీ ఎస్‌వోపీ(స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) ప్రతిపాదించినట్లు తెలిపారు. ఉన్న తాళం చెవితో రత్న భాండాగారం తాళం తెరవలేకపోతే పగులగొట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యంగా పూరీ జిల్లా ఖజానాలో అందుబాటులో ఉన్న రత్న భాండాగారం తాళం చెవిని ఉన్నత స్థాయి కమిటీ సమావేశానికి ముందు సమర్పించాల్సిందిగా శ్రీ జగన్నాథ ఆలయ ప్రధాన పాలన అధికారి (సీఏవో)ని అభ్యర్థించారు. రత్న భాండాగారం తెరిచే సమయంలో తోబుట్టువులతో శ్రీజగన్నాథుని రత్న వేదికపై దర్శించుకోవడంలో భక్తులకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నారు. అలాగే తమ వంతు చర్యలు చేపట్టేందుకు భక్తుల సహకారం కోరినట్లు జస్టిస్ బిశ్వనాథ్ రథ్ తెలిపారు.

మరమ్మతులు పూర్తి చేస్తాం: మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్

రథయాత్ర తర్వాత దేవతలు రత్న సింహాసనంకు తిరిగి వచ్చేలోపు ఖచ్చితంగా మరమ్మతు పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ అన్నారు. కమిటీ నిర్ణయించిన రోజునే రత్న భాండాగారం తెరిచి విలువైన వస్తువుల లెక్కింపు, తూకం మొదలవుతుందని తెలిపారు. కమిటీ ఎస్ఓపీని ప్రభుత్వం పరిశీలించి తదనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రత్న భాండాగారం తెరిచే సమయంలో దేవస్థానంలో దేవుళ్ల దైనందిన కార్యకలాపాలకు ఏమాత్రం అంతరాయం లేకుండా చూడాల్సి ఉందన్నారు. రత్న భాండాగారం సమగ్ర వివరాలు డిజిటల్ డాక్యుమెంట్ చేయబడుతుందన్నారు. అందుబాటులో ఉన్న తాళం చెవితో తాళం తెరవకుంటే, మేజిస్ట్రేట్ సమక్షంలో పగలగొడతామని స్పష్టం చేశారు. ఇకపై రథయాత్రలో ప్రతి సంవత్సరం గర్భ గృహ, రత్న భాండాగారం మరమ్మతులు చేయనున్నట్లు వెల్లడించారు.

రంగంలోకి ఏఎస్ఐ బృందం

మరోవైపు శ్రీ మందిరం వార్షిక నిర్వహణ కార్యకలాపాలు పురస్కరించుకుని భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సాంకేతిక కమిటీ పరిశీలన నిమిత్తం ఆలయానికి చేరుకుంది. నిర్వహణ కార్యకలాపాల విధివిధానాలను అనుబంధ కమిటీ ఖరారు చేయడంతో ప్రత్యక్షంగా రంగంలోకి దిగేందుకు సన్నద్ధత ప్రకటించింది. గర్భగుడి, నాట్య మండపం, జగ్‌మోహన్, రత్న సింహాసనం మరమ్మతుల పనులను ఏఎస్ఐ సాంకేతిక నిపుణుల కమిటీ పర్యవేక్షిస్తుంది.

గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని మునిగుడలో మంగళవారం కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 80.400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపిన జిల్లా పోలీస్ యంత్రాంగం ఈ మేరకు విస్తృతంగా దాడులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మునిగుడలోని మామ్స్ కేఫ్ వద్ద అనుమానస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా, నాలుగు బస్తాల్లో గంజాయి పట్టుబడింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టుకు తరలించారు.

అవుట్ లుక్ ఐకార్ ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానం



సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలోని ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు అవుట్ లుక్ ఐకార్ ర్యాంకింగ్-2024లో ప్రథమ స్థానం లభించడం గర్వకారణంగా ఉందని వర్సిటీ ఉపకులపతి డా.సుప్రియా పట్నాయిక్ తెలిపారు.

సెంచూరియన్ వర్సిటీ అకడమిక్ ఎక్సలెన్స్ ఫ్యాకల్టీ నాణ్యతా ప్రమాణాలతో పాటు మౌలిక సౌకర్యాలు, పరిశోధన శాఖను పరిశీలించి ఈ ర్యాంకు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. కళాశాల ఫ్యాకల్టీ అంకిత భావం, ఆకట్టుకునే ప్రదర్శన, అగ్రిఫెస్ట్‌లతో అద్భుతమైన మైలురాయిని సాధించిందన్నారు. కళాశాల ఒడిశాలో నంబర్ వన్ స్థానం సాధించడంపై వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు హర్షం వ్యక్తం చేశారు. భారతదేశంలోనే అత్యుత్తమ విద్యనందించే వర్సిటీల్లో సెంచూరియన్ ఒకటిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు.

భజన గాయకులపై ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న హిందూ ఏక్తా వాహిని సభ్యులు

కొరాపుట్: భజన గాయకులపై హిందూ ఏక్తా వాహిని సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి సభ్యులు మూకుమ్మడిగా నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. సంబల్‌పురి గాయకుడు రుకు సున, హిమాం సాగర్‌లు దేవ దేవుడు జగన్నాథ స్వామివారిని కించపరుస్తూ పాటలు పాడారన్నారు. వీరిపై రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని క్యాపిటల్ పోలీస్‌స్టేషన్‌లో యువత ఫిర్యాదు చేశారన్నారు.

ప్రతిసారీ వారు ఇటువంటి పాటలు పాడడం, ప్రజలు ఎదురు తిరిగితే క్షమాపణలు చెప్పడం అలవాటుగా మారిందని మండిపడ్డారు. వీరిద్దరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఫిర్యాదు కాపీని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీకి పంపుతున్నట్లు హిందూ ఏక్తా వాహిని సభ్యుడు అనంత పండా ప్రకటించారు.

శివారు ప్రాంతాలకు సాగునీరు: కలెక్టర్



అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

హిరమండలం: వంశధార గొట్టా బ్యారేజీ ఎడమ ప్రధాన కాలువ ద్వారా దాదాపు శివారు ప్రాంతాలన్నింటికీ సాగునీరు అందించామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. ఆయన మంగళవారం హిరమండలంలోని గొట్టా బ్యారేజ్, వంశధార రిజర్వాయర్, నాగావళి, వంశధార అనుసంధాన హైలెవల్ కెనాల్‌ను పరిశీలించారు. అలాగే రిజర్వాయర్ స్పిల్‌వే వద్ద జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణం, ఇప్పటివరకు జరిగిన పనులు, ఇంకా జరగాల్సిన పనుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

తాను కొత్తగా వచ్చానని, వంశధార రిజర్వాయర్, గొట్టా బ్యారేజ్ ఎడమ, కుడి ప్రధాన కాలువలు ఎలా ఉన్నాయో చూసేందుకు వచ్చానని తెలిపారు. ఆర్అండ్ఆర్, భూసేకరణ వంటి అంశాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఖరీఫ్ పనులకు సాగునీరు అందించేందుకు రూ.54 లక్షలతో కాలువల్లో గుర్రపు డెక్క, పూడికల తొలగింపు చేపట్టామన్నారు. సాగునీటిని సుమారు 104 కిలోమీటర్లకు పైగా కాలువల ద్వారా పంపించినట్లు తెలిపారు. త్వరలో కుడి కాలువకు సాగునీరు విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, వంశధార ఎస్ఈ బి.రాంబాబు, కట్టడాల విభాగం ఈఈ ఎంవీ రమణ, తహసీల్దార్ రాంబాబు ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి వంశధార ఇంజినీర్లు ఉన్నారు.

అడపా పాహండిలో అపశృతి



సేవాయత్‌లను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: గుండిచా మందిరం అడపా మండపానికి రథాలపై మూల విరాటులను తరలిస్తుండగా అపశృతి చోటు చేసుకుంది. తాళ ధ్వజం నుంచి బలభద్ర స్వామి విగ్రహం దించుతుండగా మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో 2 మంది సేవాయత్‌లు రథం పైనుంచి కిందికి జారిపోయారు. వీరిరువురు గాయాల పాలయ్యారు. సత్వర చికిత్స కోసం అంబులెన్సులో స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు.

సీఎం కాన్వాయ్ అడ్డుకున్న మహిళ



మహిళని తీసుకెళ్తున్న పోలీసులు

భువనేశ్వర్: నగరంలో ముఖ్యమంత్రి కాన్వాయ్‌ని ఓ మహిళ అడ్డుకుని కలకలం రేపింది. మంగళవారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానిక రసూల్‌గఢ్ స్క్వేర్ వద్ద ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ కార్కేడ్ ముందు గుర్తు తెలియని మహిళ అకస్మాత్తుగా అడ్డు తగిలింది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నగరంలోని వీఎస్ఎస్ నగర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొని తన నివాసానికి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. సాయంత్రం 5 గంటలకు రసూల్‌గఢ్‌లో ముఖ్యమంత్రి వాహనం సాఫీగా వెళ్లేందుకు సాధారణ ప్రజల వాహనాల రాకపోకలు స్తంభింపజేశారు. ఈ పరిస్థితిని నిలదీసేందుకు మహిళ బాహాటంగా రంగంలోకి దిగింది. పోలీసు యంత్రాంగం ఉలికిపాటుకు గురైంది. ఆమెని బుజ్జగించి తొలగించేందుకు ప్రయోజనం లేకపోవడంతో బలవంతంగా పక్కకు లాగి ముఖ్యమంత్రి వాహన రవాణాకు మార్గం సుగమం చేశారు. మహిళ ఎవరనేది ఇంకా తెలియరాలేదు. పోలీసులు ఆమెను ప్రశ్నిస్తున్నారు.


లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పని చేసే ప్రదేశాలు, కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నుంచి మహిళలకు రక్షణ కల్పించే చట్టం ఉందని, దీనిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు భవనంలో జిల్లా న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో గల ఆస్పత్రుల సిబ్బంది, ఫ్యాక్టరీస్, షాపింగ్ మాల్స్, ఇతర కార్మికులకు లైంగిక వేధింపులకు సంబంధించి చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే బైక్‌పై ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మె ట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన దొర, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అజయ్ కార్తికేయ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, మోటార్ ఇన్‌స్పెక్టర్ పీవీ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవం... రథాలపై దేవుళ్ల దర్శనం



తాళ ధ్వజంపై బలభద్ర స్వామి



నందిఘోష్ రథంపై శ్రీజగన్నాథుడు

భువనేశ్వర్: రథాలపై దేవుళ్లని దర్శించుకునే అవకాశం రథయాత్ర సమయంలోనే సకల జనులకు కలిసి వస్తుంది. మూల విరాటుల అలంకరణ, మంగళ హారతి ఇతరేతర పలు సేవలు భక్తుల సమక్షంలో జరుగుతుంటాయి. గుండిచా మందిరం అడపా మండపానికి వెళ్లేంత వరకు యాత్రికులకు ఈ అవకాశం నిరవధికంగా లభిస్తుంది. ఈ సందర్భంగా మూల విరాటులను రాత్రింబవళ్లు నిరాటంకంగా దర్శించుకునేందుకు వీలవుతుంది.



దర్ప దళనంపై దేవీ సుభద్ర

కూర్మావతారంలో జగన్నాథుడు

గుండిచా మందిరంలో కొలువైయున్న శ్రీజగన్నాథుడు మంగళవారం కూర్మ, మత్స్య అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామివారిని మనసారా దర్శించుకోవాలని భక్తులు బారులుతీరారు. స్వామివారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: గుణుపూర్‌లో కూర్మావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు



పర్లాకిమిడి: భక్తులకు దర్శనమిస్తున్న శ్రీజగన్నాథుడు




కొరాపుట్: కూర్మావతారంలో దర్శనమిస్తున్న దేవదేవుడు



కొరాపుట్: విద్యుత్ వెలుగుల్లో గుండిచా మందిరం



రాయగడ: గుండిచా మందిరంలో కూర్మావతారంలో జగన్నాథుడు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో జగన్నాథుడి దర్శనం



జయపురం: పూర్ణఘడ్‌లో భక్తులకు మత్స్యావతారంలో దర్శనం



రాయగడ: భజన సంకీర్తన కార్యక్రమం

● ప్రాణదానం



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీరోడ్డులో మంగళవారం ఓ పదేళ్ల బాలుడు ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్నాడు. వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు గ్రామానికి చెందిన యశ్వంత్ అనే బాలుడు తన తల్లితో కలిసి రోడ్డు దాటుతుండగా బస్సు, ద్విచక్రవాహనం రెండింటి మధ్యలో ఉండిపోయి పడిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పూర్తిగా కదలికలు నిలిచిపోవడంతో అదే ద్విచక్రవాహనంపై ఉన్న డాక్టర్ కె.అఖిల్ చిన్నారిని రోడ్డు పక్కకు తీసుకుని వెళ్లి సీపీఆర్ చేశారు. కాసేపటికి బాలుడు స్పృహలోకి రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమీపంలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ బాలుడికి సపర్యలు చేసి వారిని ఆటోలో నువ్వలరేవు గ్రామానికి తీసుకెళ్లాడు. – కాశీబుగ్గ

క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

- ఫిర్యాదు చేసిన ఉపాధిహామీ వేతనదారులు



వేతనదారులతో విచారణ చేస్తున్న తహసీల్దార్ రమాదేవి

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉపాధిహామీ పనులు చేయాలంటే లంచం ఇవ్వాల్సిందేనని, మరోవైపు తమను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నారని గుర్ల మండలం పాలవలస గ్రామానికి చెందిన ఉపాధి హామీ వేతనదారులు తహసీల్దార్ ఎదుట తమ బాధను వెళ్లగక్కారు. ఉపాధి పనులకు వెళ్తున్న తమను లైంగికంగా వేధించడంతో పాటు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఉపాధిహామీ వేతనదారులు ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు మంగళవారం గ్రామంలోని సచివాలయం వద్ద ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేతనదారులు చేసిన ఆరోపణల మేరకు తహసీల్దార్ రమాదేవి విచారణ చేపట్టారు. ఈ విచారణకు వేతనదారులు హాజరై వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీ పనుల కోసం ఫీల్డ్ అసిస్టెంట్ తమను లైంగికంగా వేధిస్తున్నారని, ఉపాధి హామీ పనులు చేసుకునేందుకు అవసరమైన జాబ్‌కార్డు కావాలని అడిగితే 5వందలు రూపాయలు వసూలు చేస్తున్నారని, అంతేకాకుండా ఉపాధి పనులకు సంబంధించి ప్రతి ఒక్కరు నుంచి వారానికి రూ.50 వసూలు చేస్తున్నారని విచారణలో తెలిపారు.

18 నుంచి కుష్ఠు వ్యాధిపై సర్వే

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు తదితరులు

విజయనగరం ఫోర్ట్: ఈనెల 18వతేదీ నుంచి ఆగస్టు 2 వతేదీ వరకు జిల్లాలోని కుష్ఠు రోగులను గుర్తించేందుకు సర్వే నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈమేరకు ఆయన తన చాంబర్‌లో మంగళవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చర్మంపై స్పర్శ, దురద, నొప్పి లేని మచ్చలు కుష్ఠు వ్యాధి లక్షణాలని తెలిపారు. చర్మంపై ఎర్రని, రాగిరంగు మచ్చలు ఉంటే కుష్ఠు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 2022లో జిల్లాలో 317 కేసులు నమోదయ్యాయని, 2023లో 372 కేసులు, 2024లో ఇప్పటి వరకు 70 కేసులు నమోదయ్యాయని తెలిపారు. కుష్ఠు రోగులను త్వరగా గుర్తించడం ద్వారా వారు అంగవైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చునన్నారు. జిల్లాలో 1785 టీమ్‌లు ఇంటింటా సర్వే నిర్వహించనున్నాయని తెలిపారు. వానిరి ఆశవర్కర్, స్వచ్ఛంద వలంటీర్ టీమ్‌గా ఉంటారని చెప్పారు. ఈనెల 15వతేదీ నుంచి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 7,713 ఓఆర్‌ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుత కుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ లారీలు, జేసీబీల సీజ్

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో కొండపోరంబోకు కొండ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న 5 లారీలతో పాటు రెండు జేసీబీలను రెవెన్యూ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి సీజ్ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి గాను ఎటువంటి అనుమతులు లేకుండా 10 ఎకరాల విస్తీర్ణంలో గల కొండ పోరంబోకు నుంచి గ్రావెల్‌ను కొద్ది రోజులుగా అక్రమంగా తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందగా ఆర్‌ఐ సతీష్‌తో పాటు సర్వేయర్, వీఆర్‌ఓతో పాటు సిబ్బంది ఆ ప్రాంతాన్ని పరిశీలించి గ్రావెల్ తరలిస్తుండగా లారీలను, జేసీబీలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం భూగర్భగనుల శాఖ ఏడీఏకు అక్రమ రవాణా విషయమై నివేదిక అందచేసి చర్యలు తీసుకోనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

నమ్మించి మోసగించిన వ్యక్తికి పదేళ్ల జైలు, జరిమానా

బొబ్బిలి: ప్రేమిస్తున్నట్టు నటించి పెళ్లి చేసుకుంటానని లోబర్చుకుని, ఆ తరువాత పెళ్లికి నిరాకరించిన ఓ యువకుడికి విజయనగరం మహిళా కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.30వేల జరిమానా విధించినట్టు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బొబ్బిలి పట్టణంలోని గుడారి వీధికి చెందిన సర్వసిద్ధి వెంకటేష్... స్థానికంగా ఉన్న ఓ కాలనీకి చెందిన 25 ఏళ్ల యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. దీంతో ఆమె జూలై7, 2016న బొబ్బిలి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ వై.రవి కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. తుది విచారణ అనంతరం మహిళా కోర్టు న్యాయమూర్తి ఎస్.పద్మావతి మంగళవారం పై విధంగా తీర్పునిచ్చారు.

ప్రతిభ చూపితే.. భవిత మీదే

- విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- 6–11వ తరగతి విద్యార్థులకు అవకాశం
- ఎంపికైతే స్కాలర్‌షిప్, ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్
- సెప్టెంబరు 15 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన తుదిగడువు



విద్యార్థి విజ్ఞాన్ మంథన్ లోగో

పార్వతీపురంటౌన్: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం)పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన ప్రసాద్, విజ్ఞాన భారతి సంయుక్తంగా విద్యార్థి విద్యాన్‌మంథన్(వీవీఎం) పేరిట ఏటా ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో 1599 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఈ పాఠశాలల్లో 1,18,569 లక్షల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న వారికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్ షిప్ పొందే అవకాశం ఉంది.

'జూనియర్, సీనియర్ విభాగాల్లో...

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6–8 తరగతులకు జూనియర్, 9–11 తరగతులకు సీనియర్ గ్రూపుగా ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లిషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి వారికి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.

100 మార్కులకు పరీక్ష

ఈ పరీక్షకు సంబంధించి మాక్ పరీక్ష అక్టోబర్ 10న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష అక్టోబర్ 29, 30 తేదీల్లో ఉంటుంది. అయితే ఇందులో ఏదో ఒక రోజు పరీక్ష రాసే వెసులుబాటు ఉంది. ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్యకాలంలో 90 నిమిషాల పాటు పరీక్షను రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ఒకసారి యాప్‌లో లాగిన్ అవగలుగుతారు. పరీక్ష పూర్తిగా అబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లోనూ 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్ –ఎ లో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి 20 ప్రశ్నలు, సెక్షన్ –బిలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, రీజనింగ్ 10 ప్రశ్నలు ఉంటాయి.

దరఖాస్తు విధానం ఇలా...

ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ. 200రుసుం చెల్లించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ ఏడాది మే 19న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా సెప్టెంబర్ 15వ తేదీన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది. ప్రవేశపరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులకు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్, మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాలను ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశముంది. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరీక్షలు ఉంటుంది. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇప్పటికే వైబ్‌సైట్‌లో పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

హెచ్‌ఎంలు కృషి చేయాలి



ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు విజ్ఞాన్ మంథన్ పరీక్షలో పాల్గొనేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. రోజూ ఒక గంట కోచింగ్ ఇచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తయారు చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 20 నుంచి 30 వరకు విద్యార్థుల నమోదు ఉంటే ఆ పాఠశాలలకు పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తారు.

– జి. పగడాలమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక ఇలా..

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి విద్యార్థుల వంతున 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2023–24లో జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్డీఓ, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్ వంటి ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1–3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

18 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

- వచ్చే నెల 16నుంచి జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు
- జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కేపీ నాయుడు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీ లు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కేపీ నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా 18న అండర్–11, 13 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు సింగిల్స్/డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా 19న అండర్–15,17 వయస్సుల విభాగాల్లో, 20న అండర్–19, మెన్/ ఉమెన్ విభాగంలో, 21న వెటరన్స్ విభాగంలో సింగిల్స్, డబుల్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సింగిల్స్ విభాగానికి రూ.500, డబుల్స్ విభాగానికి రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, కొత్తవలస, ఎస్‌కోట, విజయనగరం, చీపురుపల్లి కేంద్రాలుగా ఎంట్రీలు నమోదు చేయనున్నామని ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 15లోగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

వచ్చే నెల 16నుంచి జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు

ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉత్తర్వుల మేరకు 2024–25 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలను జిల్లా వేదికగా వచ్చే నెల 16 నుంచి 19వ తేదీ వరకు నాలుగు రోజు పాటు నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కేపీ నాయుడు వెల్లడించారు. నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు అక్టోబర్ నెలలో ఉత్తర ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నున్న సురేష్, అసోసియేషన్ ప్రతినిధులు వై.కుసుంబచ్చన్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గంగ పుత్రుల బెంగ



చింతపల్లి తీరంలో నిలిపిన బోట్లు

- మత్స్యకార భరోసా సాయంపై నీలినీడలు
- సముద్రంలో వేట ప్రారంభమై 20 రోజులు
- ప్రభుత్వం నిర్ణయం కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

పూసపాటిరేగ: సముద్రంలో చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులు వేట నిషేధ సాయం మత్స్యకార భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. సముద్రంలో వేట నిషేధ సమయం ముగిసి 20రోజులు దాటుతున్నా నూతన సర్కారు నుంచి ఎటువంటి ప్రకటన వెలవడలేదు. సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న మత్స్యకారులకు ఈఏడాది మత్స్యకార భరోసా అందని ద్రాక్షలా మిగలడంతో ఇబ్బంది పడుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసాను పెంచడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను భారీగా పెంచి వేట చేసిన ప్రతి మత్స్యకారుడికి రూ.10 వేలు చొప్పున అకౌంట్‌లో జమచేశారు. అయితే నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మత్స్యకార భరోసాపై కనీసం ప్రకటన చేయకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.4వేలు ఉన్న మత్స్యకార భరోసాను రూ.10 వేలుకు పెంచి వెంటనే అకౌంట్లలో జమచేసేది. 2020, 2021, 2022, 2023 సంవత్సరాలలో క్రమం తప్పకుండా మత్స్యకారుల ఖాతాలకు భరోసా నగదు జమచేసింది. జిల్లాలో ఈఏడాది మత్స్యకార భరోసాకు 3,798 మందిని ఎంపిక చేశారు. సర్వే కూడా పూర్తయిన తరువాత అర్హులను గుర్తించి జాబితాను ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలో మీటర్ల తీరప్రాంతం ఉంది. ఆ తీరప్రాంతం పరిధిలో సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. చేపల వేటపై ప్రత్యక్షంగా 6 వేల మంది, పరోక్షంగా 15 వేల మంది జీవిస్తున్నారు. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్రప్రభుత్వం 61 రోజుల పాటు వేట నిషేధం ప్రకటించింది. ఆ సమయంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం సాయం అందిస్తుంది. కానీ నూతనగా వచ్చిన ప్రభుత్వం సాయం ఊసెత్తకపోవడంతో అసలు సాయం అందిస్తుందా? లేదా? పథకానికి మంగళం పాడుతుందా? అనే విషయమై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

తక్షణమే మత్స్యకార భరోసా ఇవ్వాలి



వేట చేసిన ప్రతి మత్స్యకారుడికి మత్స్యకార భరోసా సాయం అందించాలి. వేట నిషేధ సమయం ముగిసి 20 రోజులు దాటుతున్నా ప్రభుత్వం కనీసం ప్రకటన కూడా విడుదల చేయలేదు. మత్స్యకారులకు తక్షణమే సాయం చేసి ఆదుకోవాలి.

– బర్రి దాసు, మత్స్యకారుడు చింతపల్లి పెద్దూరు

సాయం అందేదెప్పుడు?



నిషేధం తరువాత వేట ప్రారంభించి 23 రోజులు అవుతున్నా నిషేధ సమయంలో మంజూరు చేయాల్సిన నగదు అకౌంట్‌లోకి జమకాలేదు. గతంలో వేట నిషేధసమయంలో అకౌంట్‌లోకి సాయం జమకావడంతో సంతోషంగా గడిపేవాళ్లం. నేటి పరిస్థితి చూస్తే కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత మత్స్యకార భరోసాపై ఎటువంటి ప్రకటన చేయలేదు. తక్షణమే స్పందించి మత్స్యకారులకు సాయిం అందించాలి.

– బర్రి చినఅప్పన్న, జిల్లామత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, విజయనగరం

నేడు జాతీయ మత్స్యకార దినోత్సవం

పార్వతీపురంటౌన్: జాతీయ చేపల పెంపకం మండలి (ఎన్‌ఎఫ్‌డీబీ) సహకారంతో చేపల పెంపకం, మత్స్య మంత్రిత్వశాఖ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ ప్రతి సంవత్సరం జూలై 10న జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని జరుపుకుంటోందని పార్వతీపురం మన్యం జిల్లా మత్స్యశాఖాధికారి తురుపతయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థిరమైన నిల్వలు, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలను నిర్ధారించడానికి దేశం మత్స్య వనరులను నిర్వహించే విధానంలో మార్పులపై దృష్టిని ఆకర్షించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. చేపల పెంపకంలో చేపల రైతులు, ఆక్వాప్రెన్యూర్లు, ఫిషర్ ఫోక్‌లు, భాగస్వాములు, చేపల పెంపకంలో వారి సహకారం కోసం ఇంకా ఎవరు సంబంధం కలిగి ఉన్నారో వారిని గౌరవించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24వ జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ఆర్‌సీఎం స్కూల్ బిల్డింగ్ మీటింగ్ హాలులో నిర్వహించనున్నామని తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ నేతృత్వంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, శంబరి కృష్ణలు శాస్త్రోక్తంగా అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి దీపపదార్థాలతో నివేదన చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.

విద్యుత్‌శాఖ అధికారులపై సస్పెన్షన్ వేటు

మెంటాడ: మండలంలోని మీసాలపేట గ్రామంలో ఈ నెల 5న విద్యుత్‌షాక్‌తో రైతు దంపతులు కోరాడ ఈశ్వరరావు, ఆదిలక్ష్మి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈదురుగాలులకు పొలంలో తెగిపడిన విద్యుత్ తీగెను సరిచేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రమాదం సంభవించినట్టు ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీనికి బాధ్యులుగా ఏఈ తిరుపతిరావు, లైన్‌మన్ సుదర్శన్, జూనియర్ లైన్‌మన్ కాంతారావును సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పరిశుభ్రతకు ప్రత్యేక శ్రద్ధ

- ఆర్‌డీడీ నాగరాజు

బొబ్బిలి: పట్టణాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, సేకరణ సమయంలోనే తడి, పొడిచెత్తను వేరుచేయాలని మున్సిపల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ జి.నాగరాజు సూచించారు. బొబ్బిలి మున్సిపల్ కార్యాలయంలోని అన్ని సచివాలయాల సెక్రటరీలు, మున్సిపల్ అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఎన్‌జీటీ మార్గదర్శకాల ప్రకారం కాలువలను నిత్యం శుభ్రపరచాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా నిరంతరం పర్యవేక్షించాలని, కాలువల్లో పూడికలు తొలగించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌ల వారికి చెత్తను కంపోస్టు చేసే పద్ధతులను వివరించాలన్నారు.

రోటరీ సేవలకు పురస్కారాల పంట



సాధించిన అవార్డులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు



క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

విజయనగరం: విజయనగరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరంలో అందించిన సేవలకు పురస్కారాల పంట లభించింది. క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతి ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు సంబంధించి 27 అవార్డులు దక్కించుకున్నారు. ఈ మేరకు కొత్తగ్రహారంలో గల రోటరీ క్లబ్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డులను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు రోటరీ క్లబ్‌కు దక్కిన అవార్డుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతి మాట్లాడుతూ 2023–24 సంవత్సరంలో విజయనగరం జిల్లా కేంద్రంలో రోటరీ క్లాక్ టవర్, నెల్లిమర్లలో ఉచిత మంచి నీటి ప్లాంట్‌ల ఏర్పాటుతో పాటు ఉచిత రక్తదాన శిబిరాలు, నేత్ర వైద్య శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టినందుకు అవార్డులు లభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం 2024–25 సంవత్సరానికి సంబంధించి నూతనంగా క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన జి.వినోద్‌కుమార్, జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

ఆపదలో ఉన్నవారికి అత్యంత అవసరమైన రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, ఆర్.శంకరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రోటరీ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు.తొలుత కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలు సమకూర్చారు. మొక్కలు నాటారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన వీరు మాట్లాడుతూ రక్తదానం పట్ల అపోహలు వీడాలని, రక్తదానం చేసిన వ్యక్తి చురుగ్గాగా, ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. రక్త నిధి కేంద్రాల్లో రక్తం నిల్వల కొరతను అధిగమించేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డి.ఉమాబాలాజీ, ప్రతినిధులు అరుణ్‌కుమార్ సాధాని, జి.శివ కుమార్, జయకృష్ణ, టీఎల్ఎన్. మూర్తి, వీవీ రాజేష్, బత్తుల చందులతో పాటు రోటరీ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిరుద్యోగులపై కక్ష సాధింపు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథ రావు

- సీఐటీయూ ఆవేదన

పార్వతీపురంటౌన్: చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు గ్రామిక మహిళా సంఘం నాయకురాలు వి.ఇందిర అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పట్టణంలోని సుందరయ్య భవనంలో మంగళవారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం గెలిచిన తర్వాత ఆ నాయకులు కిందిస్థాయి చిరు ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం చాలా దురదృష్టకర మన్నారు. జియ్యమ్మవలస ఎంపీపీ బొంగు సురేష్ ఫీల్డ్ అసిస్టెంట్‌లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ఎంపీడీఓ పిలిచారని తన చాంబర్‌కు పిలిపించుకుని దుర్భాషలాడడం సరికాదన్నారు. జూన్ 30వ తేదీన జోగులుడుమ్మ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ బూర్ల నాగమణిని మహిళ అని చూడకుండా మానసికంగా వేధిస్తూ నీకు నువ్వుగా రాజీనామా చేయాలని లేని పక్షంలో ఇబ్బందులు తప్పవని బూతులు తిడుతూ మానసికంగా వేధించారని మండిపడ్డారు. సిగబడి ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రసింహాచలం బలవంతంగా రాజీనామా చేసినట్లు తన చాంబర్‌లో సంతకం పెట్టించడం దారుణమైన చర్య కావున, ఇలాంటి కక్ష సాధింపు చర్యలు ఎంపీపీ మానుకోవాలని హితవు పలికారు. ఈ విషయమై గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ అధ్యక్షుడు హరినాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బొత్స హయాంలో అభివృద్ధి



మంత్రి బొత్స జన్మదినోత్సం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు

- రాష్ట్రంలో ఆదర్శంగా చీపురుపల్లి నియోజకవర్గం
- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్
- ఘనంగా మాజీమంత్రి జన్మదినోత్సవం



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హయాంలో చీపురుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు స్వర్ణయుగంలా నడిచాయని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించిన ఘనత ఆయనకే దక్కుతుందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల నేతల ఆధ్వర్యంలో మంగళవారం వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బైక్ ర్యాలీగా వెళ్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో పూజలు నిర్వహించి, బాపూజీ వృద్ధాశ్రమం, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అంతకుముందు మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ 2004కి ముందు అభివృద్ధికి దూరంగా ఎలాంటి సౌకర్యాలు లేకుండా చీపురుపల్లి నియోజకవర్గం ఉండేదన్నారు. కనీసం రోడ్డు, తాగునీటి సౌకర్యం కూడా లేవన్నారు. అలాంటి పరిస్థితుల్లో 2004లో చీపురుపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొత్స సత్యనారాయణ ఎమ్మెల్యే అంటే అర్థాన్ని చూపించారన్నారు.

ఇనుమడించిన నియోజకవర్గ అభివృద్ధి

నియోజకవర్గంలో విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, రహదారులు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని చెప్పారు. సంకిలి నుంచి రాజాం మీదుగా తాగునీటిని చీపురుపల్లికి తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోనే చీపురుపల్లి నియోజకవర్గం పేరును ఇనుమడింపజేసిన ఖ్యాతి బొత్సకు దక్కుతుందన్నారు. అలాంటి నాయకుడిని ఇటీవల ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వెలిబుచ్చారు. నిరంతరం ప్రజా సేవ చేస్తూ, అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులను ఓడిస్తే ఎవరికి నష్టమో ప్రజలే గమనించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, దన్నాన జనార్దనరావు, బెల్లాన త్రినాథరావు, కరిమజ్జి శ్రీనివాసరావు, చందక గురునాయుడు, బెవర ఉమాకుమారి, గవిడి సురేష్, కొసిరెడ్డి రమణ, కోరుకొండ దాలయ్య తదితరులు పాల్గొన్నారు.